కందిపప్పు ... కొందరికేనా!

● 40 శాతం రేషన్ కార్డులకే కంది పప్పు సరఫరా చేయడంలో ప్రభుత్వ ఆంతర్యమేంటీ?
● ఎవరిని మభ్యపెట్టేందుకు కూటమి సర్కార్ కుటిల యత్నం?
● ఆలస్యంగా రావడంతో చేతివాటం చూపిస్తున్న డీలర్లు
● టీడీపీ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న పేదలు



ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సరఫరా చేసిన కంది పప్పు

కోడుమూరు రూరల్ : జనాన్ని మభ్యపెట్టడడం కొత్తేమీ కాదని మరోమారు నిరూపించుకుంది టీడీపీ. ప్రజలనే కాదు పార్టీలను సైతం తనకు అనుకూలంగా మార్చుకోవడంలో దిట్టగా పేరొందిని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు గత ఎన్నికల్లో జనసేన, బీజేపీని అక్కున చేర్చుకుని కూటమి హోదాలో గద్దెనెక్కాక తన నైజాన్ని చాటుకుంటూనే ఉన్నారు. ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో కందిపప్పు ధర మండుతుంది.. పేదలకు తక్కువ ధరకే అందజేస్తామంటూ కేవలం నలభై శాతం రేషన్ కార్డులకే సరఫరా చేసిన సీఎం బాబు ప్రజలను మభ్యపెట్టడంలో తన నైజమని నిరూపించుకున్నారు. దీంతో పేదలకు దసరా పండగపూట నిరాశ తప్పలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగునెలలు గడిచినా ఇప్పటి వరకు బియ్యం, చక్కెర తప్పా ఇతర సరుకులు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో మార్కెట్లో కిలో కందిపప్పు రూ.160 పలుకుతున్న వేళ కార్డుదారులకు రాయితీపై రూ.67లకే కిలో కందిపప్పు ఇస్తున్నామంటూ ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. కోడుమూరు నియోజకవర్గంలో 82,338 రేషన్‌కార్డులు ఉండగా, 40శాతం కార్డుదారులకు మాత్రమే ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేసింది. ఇలా అరకొర సరఫరా చేయడంలో కూటమి సర్కార్ ఆంతర్యమేంటీ... ఏంటీ మతలబ్ అంటూ ప్రశ్నిస్తున్నారు పేదలు. ఎవరిని మభ్యపెట్టేందుకే విమర్శలు గుప్పిస్తున్నారు కూడా.

తలలు పట్టుకుంటున్న అధికారులు, డీలర్లు

ప్రభుత్వం 40శాతం కార్డుదారులకు మాత్రమే రాయితీపై కందిపప్పు సరఫరా చేయడంతో అధికారులతోపాటు కొందరు డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఎవరికి పంచాలో తెలియక అయోమయానికి గురువుతున్నారు. ఏ రేషన్ దుకాణం, బియ్యం పంపిణీ వాహనం వద్ద చూసినా కంది పప్పు కోసం కార్డుదారులు క్యూ కట్టారు. అరకొర పంపిణీ చేసిన డీలర్లు స్టాక్ అయిపోయిందంటూ చేతులెత్తేస్తున్నారు. కొందరు డీలర్లు అసలు పంపిణీయే చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రజలు అసహనానికి గురువుతున్నారు. అక్కడక్కడ డీలర్లతో వాగ్వాదం జరిగిన సంఘటనలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు రేషన్ కార్డుదారులు. జగనన్న పాలనలో ప్రభుత్వం ప్రతి ఒక్క కార్డుదారుడికి బియ్యం, చక్కెర, బ్యాళ్లు, జొన్నలు, రాగులు తదితర వాటిని పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు పేదలు.

వారం గడిచాక కందిపప్పు సరఫరా....

కార్డుదారులందరికి కందిపప్పును అందించలేక ప్రభుత్వం రేషన్ దుకాణాలకు వారం రోజులు ఆలస్యంగా కందిపప్పు సరఫరా చేసింది. ఈ ప్రక్రియ కొందరు డీలర్లకు వరంగా మారింది. ఇప్పటికే బియ్యం, చెక్కెర తీసుకున్న కార్డుదారులకు చాలామందికి కందిపప్పు వచ్చినట్లు కూడా తెలియదు. ఇదే అదనుగా భావించిన కొందరు డీలర్లు చేతివాటం ప్రదర్శించారు. మార్కెట్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి.

కంది బ్యాళ్లను ఇవ్వలేదు



రేషన్ దుకాణంలో బియ్యం, చక్కెర మాత్రమే ఇచ్చారు. కంది బ్యాళ్లు ఇవ్వలేదు. బ్యాళ్ల గురించి అడిగితే మాకు ఇంకా రాలేదని చెప్పారు. అయితే రేషన్ దుకాణాల ద్వారా ఇస్తున్నారని తెలిసి మళ్లీవెళ్తే అయిపోయాయని చెప్పారు. అసలు నిజంగానే ప్రభుత్వం ఇవ్వాలనుకుందా.. లేదా అనే అనుమానం వస్తుంది. ఇస్తే అందరికి ఇవ్వాలి... లేదంటే ఊరుకుండాలి.. ఇదేం పద్ధతో అర్థం కావడం లేదు.

– గిడ్డయ్య, కోడుమూరు

అందరికీ పంపిణీ చేయాలి



మాకు కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఇచ్చారు. బ్యాళ్లు అడిగితే రాలేదన్నారు. కొన్ని ఊర్లలో బ్యాళ్లను కార్డుదారులకు ఇస్తున్నారు. ఇదేం పంపిణో అర్థం కావడం లేదు. ప్రభుత్వం కార్డుదారులందరికి రేషన్ సరుకులను సక్రమంగా అందజేయాలి. లేకపోతే మానేయాలి. బ్యాళ్లను కొందరికిచ్చి కొందరికి ఇవ్వకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. ఈ పద్ధతేం బాగలేదు.

– నరసింహ, బైన్‌దొడ్డి గ్రామం

క్లుప్తంగా

గుండెపోటుతో వార్డు మెంబర్ మృతి

కర్నూలు రూరల్: మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామం 13 వార్డు మెంబర్ గంగారామ్ (35) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తాగిరి గ్రామానికి వెళ్లి గంగారామ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శక్తికి ప్రతీక దసరా


మాట్లాడుతున్న వీహెచ్‌పీ ఏపీ సంఘటన కార్యదర్శి జి. శ్రీనివాసరెడ్డి

కర్నూలు కల్చరల్: శక్తికి ప్రతీక దసరా పండుగ అని విశ్వ హిందూ పరిషత్ ఏపీ సంఘటన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ఆర్‌ఎస్ఎస్ దసరా ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925లో దసరా పర్వదినాన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రారంభమైందన్నారు. అనాదిగా మనదేశంలో చెడు మీద మంచి సాధించిన విజయ పరంపరకు విజయ దశమి ఉత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. మోడరన్ ఐ హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు రాజశేఖర్ అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు భేష్


కార్మికులకు నూతన వస్త్రాలను అందజేస్తున్న ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి

కర్నూలు (టౌన్): విజయవాడ వరదల్లో నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలు ప్రశంసనీయమని ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నగర పాలకలోని తన కార్యాలయంలో.. గత నెలలో వరద సహాయక పనుల్లో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులకు విజయవాడ నగరపాలక సంస్థ నూతన వస్త్రాలు పంపిణీ చేసింది. వాటిని ఆయన పారి శుద్ధ్య కార్మికులకు అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, వలీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయండి



మాట్లాడుతున్న జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): భారత కమ్యూనిస్టు పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు కె.జగన్నాథం, ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో కర్నూలు రూరల్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో కమిటీలు, అనుబంధ సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాటాలుచేసి ప్రజల మన్నలు పొందాలని సూచించారు. రైతు సమస్యలపై నిత్యం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం మండల గౌరవాధ్యక్షుడు సి.మహేష్, మండల కార్యదర్శి బి.సురేంద్ర మాదవ్, నాయకులు బి.కృష్ణనాయక్, రబీయా, హరికృష్ణ, గురు, శ్రీరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ అప్రెంటిషిప్ మేళా

డోన్ టౌన్: ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు కర్నూలు, నంద్యాల జిల్లాలోని వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నట్లు పెర్కొన్నారు. ఐటీఐ పాసైన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరై వివిధ కంపెనీల్లో అప్రెంటిషిప్ చేసే అవకాశం పొందాలని సూచించారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, ఐటీఐ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బయోడేటాతో హాజరుకావాలన్నారు. ఐటీఐ పాసై ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి అప్రెంటిషిప్ రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు.

14 మద్యం దుకాణాలకు 507 దరఖాస్తులు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 14మద్యం దుకాణాలకు శుక్రవారం సాయంత్రం గడువు ముగిసే సమయానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 507 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. ఈనెల 14వతేదీ కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగే డ్రా ద్వారా దుకాణాలను కేటాయించడం జరుగుతుందని సీఐ పేర్కొన్నారు.

రెండుషాప్‌లకు 64 దరఖాస్తులు

పాణ్యం: పాణ్యం మండలానికి సంబంధించి రెండు మద్యం షాపులకు 64 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ క్రిష్ణమూర్తి తెలిపారు. గడివేముల మండలంలో 2షాప్‌లకు 72దరఖాస్తులు వచ్చాయన్నారు.

పార్టీని పటిష్టం చేయండి

కర్నూలు(సెంట్రల్):భారత కమ్యూనిస్టు పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు కె.జగన్నాథం, ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో కర్నూలు రూరల్ మండల కమి టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో కమిటీలు, అను బంధ సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాటాలుచేసి ప్రజల మన్నలు పొందాలని సూచించారు. రైతు సమస్యలపై నిత్యం పోరాటాలు చేయాలన్నారు. రైతు సంఘం మండల గౌరవాధ్యక్షుడు మహేష్, మండల కార్యదర్శి బి.సురేంద్ర మాదవ్, నాయకులు బి.కృష్ణనాయక్, రబీయా, హరికృష్ణ, గురు, శ్రీరాములు గౌడ్ పాల్గొన్నారు.

దసరా శుభాకాంక్షలు

కర్నూలు రూరల్: వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి కటాక్షం నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా విశేష పూజలు అందుకున్న దుర్గామాత విగ్రహాల నిమజ్జన వేడుక ఈనెల 13వ తేదీ ఆదివారం తుంగభద్రా నది తీరంలోని సంకల్‌బాగ్ దుర్గాఘాట్‌లో జరగనుంది. దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవ సమితి, గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో దుర్గాఘాట్‌లో జరిగే కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 120 విగ్రహాలు శోభాయాత్రగా దుర్గాఘాట్‌కు చేరుకోనున్నాయి. మహిళలు బోనాలు, కలశాలతో యాత్రలో పాల్గొననున్నారు. సాయంత్రం 5 గంటలకు అతిథులు గంగమ్మకు పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ప్రారంభిస్తారు. దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఘాట్ వద్ద ప్రధాన వేదిక, క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఫ్లడ్‌లైట్లు, రంగు రంగుల విద్యుత్ దీపాలు, సాంస్కృతిక ప్రదర్శనల వేదిక, స్వాగత ద్వారాలను సిద్ధం చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. నిమజ్జన ఘాట్ వద్ద ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహిస్తున్న ఎస్ఐ తిమ్మారెడ్డి, సిబ్బంది

భక్తిశ్రద్ధలతో ఆయుధపూజ


కోడుమూరు పీఎస్‌లో ఆయుధ పూజ నిర్వహిస్తున్న పోలీసులు


ఆయుధపూజలో పాల్గొన్న ఎస్ఐ సునీల్ కుమార్

కోడుమూరు రూరల్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు పోలీస్‌స్టేషన్లలో ఆయుధ పూజను పోలీసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోడుమూరు పీఎస్‌లో ఏఎస్ఐ సురేంద్రబాబు సిబ్బందితో కలిసి ఆయుధ పూజ కార్యక్రమాన్ని నిర్వహించగా, గూడూరు పీఎస్‌లో ఎస్ఐ తిమ్మయ్య తన సిబ్బందితో కలిసి ఆయుధ పూజ చేశారు.

ఓర్వకల్లు: స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయుధ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో దుర్గాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు చంద్రశేఖర్‌శర్మ అమ్మవారికి విశిష్ట పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సి.బెళగల్: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలలో శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆయుధ పూజ చేశారు. అదేవిధంగా సి.బెళగల్, పోలకల్, కొత్తకోట, గుండ్రేవుల, బురాన్‌దొడ్డి గ్రామాలలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో అధికారులు, సిబ్బంది ఆయుధ పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.


పాణ్యం: మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు


కాళిమాతదేవిగా శ్రీకాన్యకాపరమేశ్వరి


మహిషాసురమర్ధిని అలంకరణలో అమ్మవారు


మహిషాసురమర్ధిని అలంకరణలో అమ్మవారు


మహిషాసురమర్ధినిగా వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి

ఘనంగా దసరా శరన్నవరాత్రోత్సవాలు

పాణ్యం: దసరా ఉత్సవాలు మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు కాళి మాత అలంకరణలో ఆకట్టుకున్నారు. హైంధవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు మహిశాసురమర్ధినిగా దర్శనమివ్వగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సి.బెళగల్: సి.బెళగల్‌లోని కొత్త బస్టాండ్ ఆవరణలోని ఈశ్వరాలయంలో పార్వతీదేవి, పాత బస్టాండ్‌లోని శ్రీ వాసవీ కన్యకపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు శుక్రవారం మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజారి సుదర్శనమాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు జరిగాయి. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చనను భక్తులు భక్తి శ్రద్ధలుగా నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలోని పార్వతీ అమ్మవారిని ఉత్సవ నిర్వాహకులు ప్రత్యేక అలంకరణ చేశారు.

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీచౌడేశ్వరీ దేవి, శ్రీకాళికామాతా, శ్రీరాములమ్మ, శ్రీతులజా భవానీ, శ్రీఅంబా భవానీ, శ్రీవల్లెలాంబదేవి ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసుర మర్ధినిగా దర్శనమిచ్చారు. శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం రాత్రి భక్తులు పోటెత్తారు. అంతకుముందు శ్రీవల్లెలాంబదేవి అమ్మవారికి కోడుమూరు, కృష్ణగిరి జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, కేఈ సుభాషిణిలు తమ తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పల్లకీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.


సి.బెళగల్: ఈశ్వరాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


శ్రీవల్లెలాంబదేవి పల్లకీ సేవలో పాల్గొన్న కోడుమూరు, కృష్ణగిరి జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, కేఈ సుభాషిణి

గూడూరులో...

దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం గూడూరు మండలంలో అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. గూడూరులోని శ్రీమాతా అంబ భవాని ఆలయంలో మహిషాసుర మర్ధినిగా దర్శనమిచ్చారు. కె.నాగలాపురం గ్రామంలో వెలసిన శ్రీసుంకులపరమేశ్వరీలు మహిషాసుర మర్ధినిదేవి అలంకరణలో కనువిందు చేశారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

దుర్గామాత ఆశీస్సులు కలగాలి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన శుక్రవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజ లు సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. నాయకులు నారాయణరెడ్డి, గోపీనాథ్, తిరుపాల్, తిరుమలేష్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.


కోడుమూరు: మహిషాసురమర్ధిని అలంకరణలో శ్రీవల్లెలాంబదేవి


మహిషాసుర మర్ధినిగా అంబా భవానీ


కోడుమూరులో మహిషాసుర మర్ధిని దేవి అలంకరణలో దుర్గామాత


కె.నాగలాపురంలో మహిషాసుర మర్ధిని అలంకరణలో శ్రీసుంకులా పరమేశ్వరి

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు


గోరంట్ల ప్రజలతో సమావేశమైన సీఐ తబ్రేజ్

కోడుమూరు రూరల్: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించినా..అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని కోడుమూరు సీఐ తబ్రేజ్ హెచ్చరించారు. శుక్రవారం తెలవారు జామున మండలంలోని గోరంట్ల గ్రామంలో సీఐ తబ్రేజ్ ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తనిఖీలు చేశారు. గ్రామంలోని అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తబ్రేజ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవాలన్నారు. అనవసర విషయాలకు గొడవలకు దిగితే కేసులు నమోదు చేసి జైళ్లకు పంపుతామని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి ప్రశాంతంగా పరిష్కరించుకోవాలన్నారు.

ఇద్దరు మద్యం విక్రయదారుల అరెస్ట్ :

సోదాల్లో భాగంగా గోరంట్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న చెరుకులపాడు ఈశ్వరయ్య, మనోహర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తబ్రేజ్ తెలిపారు. వీరు కొంత కాలంగా గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నారు. సోదాల్లో వీరి నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించాలని వినతి

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాల పనులను చేపట్టి తరగతులను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షబీర్ బాషా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను వారు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ విద్యా సంవత్సరంలో తరగుతులు ప్రారంభం కావాల్సి ఉండగా అర్ధాంతరంగా కళాశాల నిలిచిపోవడం ఆదోని ప్రజానీకం, విద్యార్థులు ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం

ఆదోని రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థంగా ఆదోని నియోజకవర్గం కాటన్ మర్చంట్ అసోసియేషన్ తరపున సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.3.20 లక్షల విరాళాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పార్థసారధికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు.

కిటకిటలాడిన దుకాణాలు


కోడుమూరులో ప్రజలతో రద్దీగా మారిన మెయిన్‌బజార్

కోడుమూరు రూరల్ : దసరా పండుగ వేళ పట్టణంలోని వ్యాపార సముదాయాలు జనంతో కిటకిటలాడాయి. శుక్రవారం ఉదయం నుంచే బట్టలు, కూరగాయలు, పూలు, టెంకాయలు, కిరాణా దుకాణాలన్ని కొనుగోలుదారులతో నిండిపోయాయి. జనాలతో రోడ్లన్ని రద్దీగా మారిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో చిన్న, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు, రైతులు ఆర్థిక ఇబ్బందుల మధ్యనే దసరా పండుగను జరుపుకుంటున్నారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకుంటూ పండుగను చేసుకుంటున్నారు.


టెంకాయలను కొనుగోలు చేస్తున్న ప్రజలు